ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 31 ఆగస్టు 2024



వివక్ష..!



శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి కేంద్రంగా ఒకే రోజు రెండు వివాదాలు తలెత్తాయి. ఆమె గెలుపుకోసం కష్టపడిన తమకు అన్యాయం చేస్తున్నారని పార్టీ యల్లనూరు మండల నాయకుడు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశాడు. మరోవైపు సెంట్రల్ వర్సిటీలో జరిగిన వన మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే శ్రావణిని ఆహ్వానించకుండా అవమానించారని ఆమె అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీకి వెళ్లి అధికారులను నిలదీశారు.

టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద శ్రావణి బాధితుల ధర్నా

పార్టీ కోసం పనిచేస్తే.. అన్యాయం చేస్తున్నారని ఆవేదన

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నరేంద్రనాయుడు అలియాస్ వాసాపురం బాబు ఆరోపించారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బైఠాయించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌కు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వాసాపురం బాబు మీడియాతో మాట్లాడారు. యల్లనూరు మండలంలో 30 సంవత్సరాల నుంచి టీడీపీ కోసం పనిచేస్తున్నామని, ఈ క్రమంలో తన అన్న కేదర్‌నాయుడును పోగొట్టుకున్నామని అన్నారు. యామిని బాల ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసిన సమయంలో ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వగ్రామం తిమ్మంపల్లిలో ఏజెంట్లుగా కూర్చునేందుకు అందరూ భయపడ్డారని, ఆ సమయంలో ఆ పంచాయతీకి 10 కి.మీ. మీటర్లలోపు గ్రామాల్లోని వ్యక్తులు ఏజెంట్లుగా కూర్చేనేలా హైకోర్టు నుంచి తాము ఉత్తర్వులు తీసుకొచ్చామని అన్నారు. అప్పటికీ కొందరు భయపడుతుంటే తన తల్లి, భార్య, వదినతోపాటు తన అన్న కుమారుడిని ఏజెంట్లుగా కూర్చోబెట్టామని అన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో బండారు శ్రావణి విజయం కోసం పనిచేశామని అన్నారు. కానీ తమ కుటుంబాన్ని ఎమ్మెల్యే పక్కనపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో తన అనుచరులకు ఎఫ్‌పీ షాపు డీలర్‌షిప్, ఫీల్డ్ అసిస్టెంటు ఉద్యోగాలు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని, దీంతో పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. పార్టీ పెద్దలు ఎమ్మెల్యేతో మాట్లాడారని, ఆమె వారి మాటలను పట్టించుకోకుండా అనధికారికంగా సమావేశం ఏర్పాటు చేసి తమ ప్రత్యర్థి వర్గానికి ఎఫ్‌పీ షాపును ప్రకటించారని అన్నారు. ఈ విషయంలో గ్రామంలో గొడవలు పడే పరిస్థితులు తలెత్తాయని, తన వర్గాన్ని శాంతింపజేశానని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా చేసైనా సాధించుకొస్తానని వారికి చెప్పివచ్చానని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, ఎఫ్‌పీ షాపుల్లో లాభాలు లేకపోయినా.. గ్రామాల్లో వాటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారని అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ రెండు తమ అనుచరులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- అనంతపురం అర్బన్



టీడీపీ జిల్లా కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకుడు వాసాపురం బాబు, కుటుంబ సభ్యులు

సెంట్రల్ వర్సిటీలో శ్రావణి మద్దతుదారుల ఆందోళన

వన మహోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని ఆగ్రహం

బుక్కరాయసముద్రం మండలంలోని సెంట్రల్ యూనివర్సిటీలో అటవీశాఖ శుక్రవారం చేపట్టిన వన మహోత్సవంలో ప్రొటోకాల్ వివాదం చిచ్చు రేపింది. శింగనమల నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిని జిల్లా అటవీశాఖ, కేంద్రీయ విశ్వవిద్యాలయం అధికారులు ఆహ్వానించలేదని ఆమె అనుచరులు మండిపడ్డారు. వర్సిటీ వద్ద నిరసన తెలిపారు. ఆహ్వానం అందని కారణంగా ఎమ్మెల్యే శ్రావణి ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అధికారుల తీరుపట్ల ఎమ్మెల్యే అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీకి వెళ్లి వీసీ కోరీ, అధికారులతో వాగ్వాదానికి దిగారు. దళిత ఎమ్మెల్యే అని వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఆహ్వాన పత్రికలో స్థానిక ఎమ్మెల్యే పేరును చివరలో ఎలా పెడతారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినా అధికారులు వైసీపీ మత్తులోనే ఉన్నారని విమర్శించారు. వర్సిటీలో వైసీపీ తొత్తులు ఉన్నారని మండిపడ్డారు. వనమహోత్సవానికి జిల్లా అటవీశాఖ, సెంట్రల్ వర్సిటీ అధికారుల నుంచి తనకు ఆహ్వానం అందలేదని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. ఈ నెల 28వ తేదీ రాత్రి తన ఇంటి వద్దకు అటవీశాఖ సిబ్బంది వచ్చి.. మంత్రి పయ్యావుల కేశవ్ వస్తారని, కార్యక్రమానికి రావాలని పిలిచారే తప్ప.. కార్యక్రమం ఉద్దేశం గురించి చెప్పలేదని అన్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని, దీనిపై స్పీకర్‌కు త్వరలోనే ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ వివాదం గురించి కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. అటవీశాఖ అధికారుల నుంచి వివరణ కోరుతానని ఎమ్మెల్యే అనుచరులకు హామీ ఇచ్చారు. వర్సిటీలో త్వరలో మళ్లీ వనమహోత్సవం నిర్వహిస్తామని, ప్రొటోకాల్ పాటించేలా చూస్తామని సర్దిచెప్పారు.

- బుక్కరాయసముద్రం



కేంద్రీయ విశ్వవిద్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి అనుచరులు



సెంట్రల్ వర్సిటీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

సెంట్రల్ వర్సిటీలో వన మహోత్సవం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 30: జంతులూరు సమీపంలోని సెంట్రల్ యూనివర్శిటీలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమలినేని సురేంద్ర బాబు, వీసీ కోరీ, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లాను అగ్రస్థానంలో నిలబెడదామని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం నిర్వహిస్తున్నామని, మొక్కలను వ్యూహాత్మకంగా, శాస్త్రీయ పద్ధతిలో నాటుతున్నామని తెలిపారు. 113 కి.మీ. పొడవున అవెన్యూ ప్లాంటేషన్, 80 హెక్టార్లలో బ్లాక్ ప్లాంటేషన్, 94 కళాశాలు, యూనివర్శిటీ మైదానాలలో ప్లాంటేషన్ చేపట్టామని తెలిపారు. జిల్లాలో విస్తృతంగా బౌండరీ ప్లాంటేషన్ చేశామని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పొలాల్లో టేకు చెట్లు పెంపకం చేపట్టామని అన్నారు. ఆర్డీటీ, రెడ్స్, డిస్కవరీ సంస్థలు మొక్కల పెంపకంలో చేపట్టడం అభినందనీయమని అన్నారు. వన మహోత్సవం ఓ ఉద్యమంలా చేపట్టాలని ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబు అధికారులుకు సూచించారు. మొక్కలను పెంచడం బాధ్యతగా భావించాలని మాంచో ఫెర్రర్ అన్నారు. జిల్లాలో పచ్చదనం లేనందుకే వర్షాలు సమృద్ధిగా కురవడం లేదని అన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ వినీత్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా జైలు సూపరింటెండెంట్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను రద్దు చేయండి: యూటీఎఫ్



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 30: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన యూపీఎస్ స్కీంను వెంటనే రద్దు చేయాలంటూ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. డీఈఓ కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులు శుక్రవారం సాయంత్రం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప విలేకరులతో మాట్లాడారు. హైస్కూళ్లను సబ్జెక్టు టీచర్లతో నింపాలన్న ఆలోచనతో ఎస్‌జీటీలను ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం 117 జీఓతో ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేసిందని, ఇప్పుడు పనిసర్దుబాటు పేరిట పాఠశాలలను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. మండల స్థాయిలో తేలికగా చేయాల్సిన సర్దుబాటు ప్రక్రియను ఆన్‌లైన్ పేరిట కఠినతరం చేశారని జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య విమర్శించారు. విద్యాశాఖ అన్ని స్థాయిల్లో పనిసర్దుబాటును సవరించి, మండల స్థాయిలోనే సర్దుబాటు జరిగేలా చూడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కోరారు.

అలవెన్స్‌లను పునరుద్ధరించాలి: ఎన్ఎంయూఏ



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు వైసీపీ హయాం నుంచి నిలిపివేసిన నైట్ అవుట్, ఓటీ అలవెన్సులను పునరుద్ధరించాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. అనంతపురం డిపో ఎదుట శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్నిరకాల అరియర్స్, సిక్ లీవుల జీతాలు, ఇంక్రిమెంట్ల అరియర్స్, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌ను ట్రెజరీ శాఖ అధికారులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర నాయకుడు భాస్కర్‌నాయుడు, డిపో కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కమిటీ నాయకులు డీఎన్ రెడ్డి, శ్రీరాములు, హరినాథరెడ్డి, వెంకటేశులు, హెచ్‌టీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కాదు.. నలుగురు



మేయర్ రేసులో మహిళా కార్పొరేటర్

మార్చి వరకూ మార్చే చాన్స్ లేదు..

అయినా.. తెరవెనుక జోరుగా రాజకీయం

అనంతపురం క్రైం, ఆగస్టు 30: మేయర్ రేసులో నాలుగో పేరు తెరపైకి వచ్చింది. కుర్చీని దక్కించుకునేందుకు పోటీ పెరుగుతోంది. మొత్తం 50 మంది కార్పొరేటర్లున్న అనంతపురం నగరపాలికలో.. ఏకంగా 48 మంది వైసీపీవారు ఉన్నారు. 40, 44వ డివిజన్ నుంచి స్వతంత్రులు గెలిచారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఒక స్వతంత్ర, ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొన్ని నగరపాలికలు, పురపాలికలలో సభ్యులు పార్టీ మారారు. కుర్చీలు తారుమారు అయ్యాయి. అనంతపురంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ మద్దతుతో కార్పొరేటర్లను దారికి తెచ్చుకుని మేయర్ పదవిని దక్కించుకోవాలని వైసీపీ కార్పొరేటర్లు నలుగురు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలకు కాంగ్రెస్ హయాంలో జారీ అయిన జీఓ (నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టకూడదు) అడ్డుగా నిలుస్తోంది. ప్రస్తుత పాలకవర్గం 2021 మార్చిలో ఏర్పాటైంది. ఒక స్వతంత్ర కార్పొరేటర్ భర్త మేయర్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తన భార్యను ఆ సీటులో కూర్చోబెట్టేవరకు విశ్రమించేది లేదు అన్నట్లుగా ఆయన తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. కార్పొరేటర్ల ఇళ్ల చుట్టూ ఆయన ప్రదక్షిణ చేస్తున్నారట. పాలకవర్గంలోని ఓ కీలక నేత కూడా అవకాశం కోసం ఎదురుచూస్తూ, పావులు కదుపుతున్నారు. ఒక యువ కార్పొరేటర్ కూడా తగ్గేదే లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేటర్లు అడిగినంత ఇచ్చేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారని సమాచారం.

తెరపైకి నాలుగో సింహం

స్వతంత్ర కార్పొరేటర్, సీనియర్ కార్పొరేటర్, యువ కార్పొరేటర్..! ఈ ముగ్గురేనా..? నాకూ కుర్చీ కావాల్సిందే అంటూ తెరపైకి ఓ మహిళా కార్పొరేటర్ వచ్చారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్ భర్త కన్ను మేయర్ సీటుపై పడింది. కాంట్రాక్టర్‌గా సైతం పని చేసిన ఆయన.. మేయర్ సీటును ఆశిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఓ నాయకుడు తాజాగా పలువురు కార్పొరేటర్లకు విందు ఏర్పాటు చేశారట. ఆ విందులో పది మందిలోపు కార్పొరేటర్లు పాల్గొన్నట్లు సమాచారం. మహిళా కార్పొరేటర్‌ను మేయర్ సీటులో కూర్చోబెట్టడానికి ఆయన తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇవన్నీ ఒక ఎత్తయితే, పైసలిచ్చినోడికే ఆ సీటు అంటున్నారు కొందరు కార్పొరేటర్లు. తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో యువ కార్పొరేటర్ చేత ఖర్చు పెట్టించాలని ప్రయత్నించారట. అందుకు ఆయన ఒప్పుకోలేదని సమాచారం. 'మార్చి వరకు ఏమీ చేయలేం కదా..? అప్పుడు చూద్దాంలే' అని ఆయన అన్నారట. ఈ లెక్కన మార్చి వరకు మేయర్ సీటు పదిలమే అయినా.. అప్పటి వరకూ ఎవరి ప్రయత్నాలు వారు, ఎవరి ఏర్పాట్లు వారు చేసుకుంటారు. మేయర్ కుర్చీ కింద కుంపటి మార్చిదాకా రాజుకుంటూనే ఉంటుంది..! ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.



టాప్ త్రీని దించేయండి..

కార్పొరేటరస్లు లాక్కోవడం, వారికి డబ్బులివ్వడం, వారే పెత్తనం చెలాయించడం లాంటివి ఇకపై వద్దు అని వైసీపీ శ్రేణులు అంటున్నట్లు సమాచారం. 'ఎలాగూ మూడేళ్లు గడిచిపోయాయి. మేయర్, డిప్యూటీ మేయర్లను దించేయండి..' అని వైసీపీలోని ఒక వర్గం డిమాండ్ చేస్తోందట. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చెవిలో ఈ ప్రతిపాదనను ఊదుతున్నట్లు తెలిసింది. మేయర్ కుర్చీ కోసం పార్టీలోని ముగ్గురు కార్పొరేటర్లు తెరపైకి రావడంతో ఇప్పుడున్న వారిని తప్పించాలనే డిమాండ్ వస్తోంది. మేయర్ పదవి ఒకరికి దక్కినా, రెండు డిప్యూటీలైనా తమకు దక్కకపోతాయా అని ఆశావహులు ఆలోచిస్తున్నారు. ఆ దిశగా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

వంకను పూడ్చిన రియల్టర్లు

- పొలంలో చేరిన వర్షపు నీరు
- న్యాయం కోసం రోడ్డెక్కిన రైతు కుటుంబం

శింగనమల, ఆగస్టు 30: రియల్ వ్యాపారం కోసం వైసీపీ హయాంలో కొందరు వంకను పూడ్చారు. అదే ప్రాంతంలో జాతీయ రహదారి పనుల్లో భాగంగా అధికారులు కల్వర్టును నిర్మించారు. దీంతో కొండ ప్రాంతం నుంచి వచ్చే నీరు తన పొలంలో నిలుస్తోందని శివపురం గ్రామానికి చెందిన రైతు రొద్దం భాస్కర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అనంతపరం-తాడిపత్రి రహదారిపై బైఠాయించాడు. దీంతో సుమారు అరగంటపాటు రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య అక్కడికి వెళ్లి రైతు కుటుంబానికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.



శింగనమల మరవకొమ్మ వద్ద రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతు రొద్దం భాస్కర్‌రెడ్డి

ఇదీ వివాదం

శింగనమల మండలం శివపురం గ్రామానికి చెందిన రైతులు రొద్దం లక్ష్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డికి చక్రాయపేట సర్వే నంబర్ 70లో పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన కొండప్పకు సర్వే నంబర్ 69లో పొలం ఉంది. రోడ్డు పక్కనే ఈ భూములు ఉన్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ భూములకు పై భాగంలో ఉన్న కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు శింగనమల చెరువులోకి పారేందుకు వంక ఉంది. సర్వే నంబర్ 69లో పొలాన్ని రియల్ వెంచర్‌గా మార్చేందుకు మట్టిని తోలారు. దీంతో చెరువు వంక పూడిపోయింది. ఈ సమస్యను రైతు భాస్కర్‌రెడ్డి గతంలోనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రియల్టర్లకు వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల మద్దతు ఉండటంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. తాజాగా రియల్టర్లు వంకను పూడ్చినచోట అధికారులు కల్వర్టు నిర్మిస్తున్నారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు కొండ ప్రాంతంలోని నీరు చెరువు వైపు వెళ్లకుండా.. భాస్కర్ రెడ్డి పొలంలో చేరింది. ఈ కారణంగా తన పంట దెబ్బతింటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు, రియల్టర్ల తీరుతో తాను నష్టపోతున్నాని అన్నారు. వంకలో మట్టిని తొలగించి, కల్వర్టును నిర్మించాలని రైతు కుటుంబం డిమాండ్ చేస్తోంది.

డీజిల్ షెడ్‌కు ఘనంగా షష్టిపూర్తి



డీజిల్ షెడ్ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీనియర్ డీఎంఈ

గుంతకల్లు, ఆగస్టు 30: పట్టణంలోని డీజల్ షెడ్‌లో శుక్రవారం 60వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ డీఎంఈ మంగాచార్యులు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు కేక్‌ను కట్ చేసి వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎంఈ మాట్లాడుతూ డీజల్ షెడ్‌కు ఘనమైన చరిత్ర ఉందన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో పలుమార్లు జీఎం అవార్డులను సాధించినట్లు తెలిపారు. ఇదంతా ఉద్యోగుల శ్రమ ఫలితంగానే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



శింగనమల చెరువులో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు చల్లా జయమ్మ

నే చచ్చిపోతా..!

తాడిపత్రికి చెందిన చల్లా జయమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో గొడవపడింది. శింగనమల మరవకొమ్మ వద్ద బస్సు దిగి చెరువులో దూకేందుకు సిద్ధమైంది. అదే సమయంలో శింగనమల నుంచి వస్తున్న యువకులు గమనించి ఆమెను అడ్డుకున్నారు. ఏఎస్ఐ చితంబరప్పకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడి చేరుకుని అమె వివరాలు తెలుసుకుని, బంధువులకు సమాచారం ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గమనించి, 108లో అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అనంతపురం నగరంలో ఉన్న బంధువులు ఆసుపత్రికి వెళ్లి జయమ్మను కలుసుకున్నారు. ఆత్మహత్య చేసుకోబోయిన జయమ్మను కాపాడిన యువకులను పోలీసులు అభినందించారు.

-శింగనమల

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30: సెప్టెంబరు నెల పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభిస్తామని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 2,86,795 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.125.71 కోట్లు మంజూరు చేసింది. ఒకటో తేదీ ఆదివారం కావడంలో ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తారని పీడీ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి శుక్రవారం నిధులు డ్రా చేసుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీలలో కమిషనర్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తారు.

టీబీ డ్యాంలో 93 టీఎంసీల నీరు

బళ్లారి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు 92 టీఎంసీలు దాటాయి. డ్యాంలోకి 33 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. డ్యాం ఎగువ భాగాన ఉన్న మలెనాడు ప్రాంతంలో రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా శుక్రవారం లెక్కల ప్రకారం 93.16 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయి. వివిధ కాలువల ద్వారా 10,067 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున డ్యాంలో 77.808 టీఎంసీల నిల్వలు ఉండేవి. ఈ ఏడాది డ్యాం త్వరగా నిండినా.. 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుపోవడంతో సుమారు 31 టీఎంసీల నీరు నదిలోకి వెళ్లింది. డ్యాం మరోసారి నిండుతుండటంతో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు అంటున్నారు.

ఆస్పత్రిలో చావు భయం!

ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలతో ప్రభుత్వ ఆస్పత్రులు అంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో సరైన సమయంలో వైద్యం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వైద్యం చేయాల్సిన డాక్టర్లు పట్టించుకోకపోవడంతో ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు తమకు తెలిసిన వైద్యం చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా రు. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే బతుకుతామనే భరోసా పోయి రోగులు, వారి బంధువులను చావు భయం వెంటాడుతోంది.

- రాత్రిపూట వెళితే చావుకేక వినాల్సిందే!
- డాక్టర్లు ఉండరు... నర్సులు పట్టించుకోరు..
- ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీగార్డులు, స్వీపర్లే వైద్యులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న మరణాలు

అనంతపురంటౌన్, ఆగస్టు 30:

- అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మయ్య(60)ను ఈనెల 21న రాత్రి రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. డాక్టర్లు ఎవరు పట్టించుకోలేదు. అయితే ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డ్ ఆ వ్యక్తికి సెలెన్ ఎక్కించి వైద్యం అందించారు. తర్వాత బొమ్మయ్య ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్లు పట్టించుకోలేదని, సెక్యూరిటీ గార్డ్ వైద్యం చేయడంవల్లే బొమ్మయ్య చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆరోపించారు.
- కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన బాలిక ముజ్నా కౌసర్(9) డెంగీ జ్వరంతో బాధపడుతుండగా కణేకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి ఈనెల 25న కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. డాక్టర్లు అడ్మిట్ చేసుకున్నారు. అయితే వైద్యం చేయడం మరిచిపోయారు. పాప మృతి చెందింది. ఆస్పత్రిలో పనిచేసే స్వీపర్ వైద్యం అందించారని, అందుకే బాలిక మృతి చెందిందని కుటుంబసభ్యులు, సీపీఐ శ్రేణులతో కలిసి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు.
- హిందూపురం పెద్దాసుపత్రిలో ఈనెల 21న ప్రసవానికి వచ్చిన ఇద్దరు గర్భిణుల విషయంలో డాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో ఇద్దరు శిశువులు చనిపోయారు. పరిగి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన గర్భిణి ప్రీతికి నొప్పులు రావడంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. వెంటనే అడ్మిషన్ చేసుకోకుండా డాక్టర్ నీరజ నిర్లక్ష్యం చేశారు. చివరకు మరుసటి రోజు తెల్లవారుజా వ ు ు న నొప్పులు మరింత ఎక్కువ కావడంతో వార్డులో ఉన్న నర్సు ఫోన్‌లో డాక్టర్‌కు విషయం తెలపగా అనంతపురం ఆస్పత్రికి వెళ్లమని చెప్పండని సమాధానమిచ్చారు. ఇక్కడేకాన్పు అయ్యేటట్లు ఉందని డాక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదు. చివరకు అక్కడ నర్సే కాన్పుచేయగా శిశువు మరణించింది.
- అదేరోజే లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన గర్భిణి ఆశాను ప్రసవం కోసం హిందూపురం ఆస్పత్రికి తీసుకురాగా ఆమె విషయంలోను డాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఇక్కడ కూడా చివరకు ఆమెకాన్పు జరిగినా శిశువు మరణించింది.
- అనంత జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఈనెల 27న రాత్రి ఎంఎంవార్డులో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు మరణించారు. తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య(38) తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా ఉదయంనుంచి ఎవరు పట్టించుకోలేదు. చివరకు మంచంపైనే రక్తం కక్కి ప్రాణాలు వదిలారు. అదేవార్డులో చికిత్స పొందుతున్న శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీకుంటకు చెందిన నాగయ్య(40) అనే రోగి కూడా సరైన చికిత్స అందక మృతి చెందాడు. ఇవి ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు మాత్రమే. గతంలో ఇలాంటి మరణాలు లెక్కకు మించి ఉన్నాయి. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మాత్రం మారకపోవడం అందరినీ కలచివేస్తోంది.

ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లతోనే వైద్యం

గతంలో కన్నా ఇపుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు, అవసరమైన డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నారు. సీహెచ్‌సీలలో అయితే ఒక్కో ఆస్పత్రిలో 12 మంది వరకు డాక్టర్లు, టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు ఉంటున్నారు. వీరుకాక శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఉంటున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ఒక్కో ఆస్పత్రిలో ఇద్దరు నుంచి ముగ్గురు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కలిపి దాదాపు 11మంది ఉంటున్నారు. ప్రతి డాక్టర్, ఇతర సిబ్బంది ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు ఆస్పత్రులలోనే ఉండాలి. ఆతర్వాత రాత్రి డ్యూటీలో ఒక డాక్టర్, ఒక నర్సు, ఎంఎన్‌ఓ, సెక్యూరిటీ మరుసటిరోజు ఉదయం 9గంటలవరకు ఉండాల్సి ఉంటుంది. కానీ ఈఆస్పత్రులలో డాక్టర్లు అసలు ఉండటం లేదు. సాయంత్రం వరకు ఉండి కొందరు తామె కాపురాలు ఉంటున్న జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. మరికొందరు తమ సొంత క్లినిక్‌లకు వెళుతున్నారు. నర్సులు ఉంటున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆస్పత్రులకు రాత్రిపూట ఎమర్జెన్సీ కేసులను తీసుకెళితే డాక్టర్లకు వీడియోకాల్ చేసి చూపించి తెలిసీ తెలియని వైద్యాన్ని నర్సులు, అక్కడున్న ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీగార్డులు, స్వీపర్లే చేసేస్తున్నారు. అందుకే ఆయా ఆస్పత్రులలో రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు.

భయపెడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు


జిల్లాప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్‌కు సెలైన్ ఎక్కిస్తున్న ఎఫ్ఎన్ఓ

ఆస్పత్రి అంటే చనిపోతున్న వ్యక్తికి కూడా బతుకుతామనే ధైర్యాన్ని ఇవ్వాలి. కానీ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. అత్యవసర సమయాలలోను, రాత్రి పూట ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలంటే రోగులు, వారి కుటుంబసభ్యులు భయపడిపోతున్నారు. ఇక్కడకు వస్తే ఎవరూ పట్టించుకోరని, డాక్టర్లు ఉండరని, ఎంఎన్‌ఓలు, స్వీపర్లు వైద్యం అందించి చంపేస్తారనే మాటలు జనం నుంచి వినిపిస్తున్నాయి. జరుగుతున్న ఘటనలు కూడా ఇందుకు బలం చేకూర్చు తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వైద్య శాఖ పరిధిలో అనంత


జిల్లా ఆస్పత్రిలో మూడురోజుల కిందట ఎంఎం వార్డులో చికిత్సపొందుతూ చనిపోయిన ఎన్‌పీకుంట నాగయ్యకు ఈసీజీ తీస్తున్న ఎంఎన్ఓ

జిల్లాలో 47 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు అర్బన్ ప్రాంతాలలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వైద్యవిధాన పరిషత్‌శాఖ పరిధిలో తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గంలలో ఏరియా ఆస్పత్రులు ఉండగా, అనంతపురం పాతూరులో ఒక సీడీ ఆస్పత్రితో పాటు ఉరవకొండ, శింగనమల, పామిడి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కొనకొండ్లలో సీహెచ్‌సీలు ఉన్నా యి. జిల్లాకేంద్రంలో జిల్లా సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఉన్నాయి. ఇన్ని ఆస్పత్రులు ఉన్నాయని గొప్పగా చెప్పుకుంటున్నా ఇక్కడ డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది అనుకున్న మేరకు ప్రజలకు వైద్యసేవలు అందించడంలేదు. ఈ ఆస్పత్రులకు రోగులు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

● జిల్లా సర్వజన ఆస్పత్రిలో దయనీయం

అనంత జిల్లా ప్రజలకు గుండెలాంటి సర్వజన ఆస్పత్రిలోను దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడకు రోజుకు 2వేల మంది వరకు వివిధ రకాల జబ్బులతో వస్తుంటారు. కనీసం 1200మంది వరకు అడ్మిషన్‌లో ఉంటూ చికిత్స పొందుతుంటారు. ఈస్థాయికి తగ్గట్టుగా వసతులు, డాక్టర్లు,నర్సులు, ఇతర విభాగాల సిబ్బంది లేకపోయినా గతంకన్నా మెరుగైన వసతులు, డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బంది ఉన్నారు. కానీ ఇప్పటికీ రోగులకు సకాలంలో సరైన వైద్యసేవలు అందించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నా యి. ఇకరాత్రి సమయాలలో డ్యూటీ డాక్టర్లు సక్రమంగా ఉండటం లేదని, నర్సులు ఉన్నా పేషెంట్లను పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్కడ ఉండే జూనియర్ డాక్టర్లు ఫోన్ ద్వారా సీనియర్ డ్యూటీ డాక్టర్లను కనుక్కొని వైద్యం అందిస్తున్నారు. అందుకే రాత్రి సమయాల్లో అత్యవసర పేషెంట్లకు ఆస్పత్రిలో ఉంటున్న ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులే వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో సకాలంలో సరైన వైద్యం అందక అనేకమంది రోగులు జిల్లా ఆస్పత్రిలో చనిపోతున్నారు.

● నిద్రమత్తులో పర్యవేక్షణ యంత్రాంగం

జిల్లాలో ఆస్పత్రులను పర్యవేక్షించే అధికార యంత్రాంగం నిద్రమత్తులో తూగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌సీలను డీఎంహెచ్ఓ, సీహెచ్‌సీలను డీసీహెచ్ఎస్, ఆస్పత్రిని సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. డాక్టర్లు డ్యూటీలకు వెళుతున్నారా? వెళ్లినవారు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారా? సమయపాలన పాటిస్తున్నారా? రాత్రి డ్యూటీలో ఉంటున్నవారు నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తున్నారా? రాత్రిపూట వస్తున్న రోగులకు తగిన వైద్య చికిత్సలు అందిస్తున్నారా ? లేదా అని మానటరింగ్ చేయాలి. కానీ ఇక్కడ పర్యవేక్షణ అధికారులు జిల్లాకేంద్రంలోనే ఎక్కువ గడుపుతున్నారు. ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగినపుడు అక్కడకు వెళ్లి తూతూమంత్రంగా పరిశీలించి వెనుదిరిగి వస్తున్నారు. ఇక జిల్లా ఆస్పత్రిలో పరిస్థితి అయితే మరీ దయనీయంగా ఉంది. ఏ డాక్టర్, ఏ నర్సు, ఏవిభాగం సిబ్బంది ఎపుడు వస్తున్నారో ఎపుడు పోతున్నారో కూడా పర్యవేక్షణ అధికారులకు తెలియడంలేదు. కేవలం హాజరు చూస్తున్నారు, జీతాలు చేస్తున్నారే తప్ప విధులకు డుమ్మా కొట్టి తిరుగుతున్నవారిని మాత్రం పట్టుకోలేకపోతున్నారు.

రాయదుర్గం ఘటనలో చర్యలు తప్పవు



రాయదుర్గం ఆస్పత్రిలో ఇటీవల జరిగిన ఘటనను సీరియస్‌గా తీసుకున్నాం. దీనిపై నేనే స్వయంగా వెళ్లి విచారణ జరిపా. వాస్తవాలు తెలుసుకున్నా. ఈవ్యవహారంపై ముగ్గురిపై చర్యలు తప్పవు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది పనితీరుపైనా నిఘా ఉంచుతున్నాం. రాత్రి డ్యూటీల సమయంలో వీడియోకాల్‌చేసి అక్కడున్నారా లేదా అనికూడా ఆరా తీస్తున్నాం. విధులకు డుమ్మా కొట్టేవారిని, విధులలో నిర్లక్ష్యం చేసి రోగుల జీవితాలతో ఆడుకునేవారిని ఉపేక్షించం.

-డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్

ఎంఎన్‌ఓలు వైద్యం చేయకూడదు



ఆస్పత్రిలో పని చేస్తున్న ఎంఎన్‌ఓలకు కొన్నింటిపై శిక్షణ ఇచ్చి ఉంటాం. సీరియస్ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చినపుడు అత్యవసర సమయాలలో మాత్రమే వారికి కొన్ని సేవలు అందించవచ్చు. అలా అని డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు ఉన్నపుడు ఎంఎన్‌ఓలు ఎట్టి పరిస్థితులలోను రోగులకు వైద్యసేవలు అందించకూడదు. రాత్రి సమయాలలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. డ్యూటీలో ఉండి వారిని వినియోగించుకున్నవారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

కణేకల్లు ఘటనపై విచారణ చేస్తున్నాం



కణేకల్లు ఆస్పత్రిలో జ్వరంతో వెళ్లిన ఓ బాలికకు స్వీపర్ వైద్యం అందించారని, ఆతర్వాత బళ్లారికి తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించి చనిపోయిందన్న ఆరోపణలు వచ్చాయి. డాక్టర్ తప్పనిసరిగా రాత్రి సమయాలలోకూడా ఉండి రోగులకు వైద్యసేవలు అందించాలి. ఇక్కడ ఆ అమ్మాయికి చికిత్స ఇచ్చామని చెబుతున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నాం. వాస్తవాలు తేలిన తర్వాత ఆస్పత్రిలో తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం. పీహెచ్‌సీలలో రాత్రిడ్యూటీ డాక్టర్లు తప్పనిసరిగా ఉండాలి. అలాఉండని వారిపై కూడా చర్యలు ఉంటాయి.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

కరువు నేలపై జ్ఞాన కాంతులు

- జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు
- ఘనంగా వర్సిటీ ఆవిర్భావ వేడుకలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 30: కరువు నేలలో జ్ఞానకాంతులు నింపిన విద్యాలయంగా జేఎన్‌టీయూ ఖ్యాతి గడించిందని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు వీసీతో పాటు రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ సాంకేతిక విద్యావిప్లవాన్ని తీసుకువచ్చి జిల్లాకు ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన ఘనత జేఎన్‌టీయూకు దక్కుతుందన్నారు. ఆరు బ్రాంచ్(కోర్సు)లతో ఏటా వందలాది మంది ఇంజనీర్లను సమాజానికి అందిస్తోందన్నారు. నేడు నాలుగు కాన్‌స్టిట్యూయెంట్ కళాశాలలు, 120కి పైగా అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలతో జాతీయస్థాయిలో ప్రథమ వర్సిటీగా జేఎన్‌టీయూ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులతోపాటు అనేక ప్రాజెక్టులు, జర్నల్స్, పేటెంట్స్‌ను సొంతం చేసుకుని తిరుగులేని వర్సిటీగా రాణిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఈవెంట్స్ కోఆర్డినేటర్లు నారాయణరెడ్డి, దుర్గాప్రసాద్, ఓఎస్‌డీటు వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్ సత్యనారాయణ, నాగప్రసాద్ నాయుడు, సురేష్‌బాబు, వైశాలి గోర్పాడే, కిరణ్మయి, సుజాత, పీర్వో డాక్టర్ ఓంప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ సుదర్శన రావు



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, స్టెప్పులతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. సమాజానికి ఇంజనీరింగ్, సాంకేతిక విద్య అవసరాలు, జేఎన్‌టీయూ మైలు రాళ్లను వివరించేలా పాటలతో ఆలోచింపజేశారు. అదేవిధంగా భరత నాట్యం, శ్రీకృష్ణ గోపికలు, జానపద నృత్యాలతో చూపరులను అకట్టుకున్నారు.

బదిలీల గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వశాఖలలో అధికారులు, ఉద్యోగుల బదిలీల గడువును వచ్చే నెల 15కి పొడిగించారు. గతంలో ఈనెల 31వరకే బదిలీలకు ఆఖరి గడువుగా ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 16శాఖలలో బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఆయాశాఖలలో ఈ బదిలీలకు సంబంధించి సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో పాటు విధివిధానాల రూపకల్పనలో ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో గడువు పొడిగించారు.

పలువురు సీఐల బదిలీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న యుగంధర్‌ను అనంతపురం జిల్లా పామిడి యూపీఎస్‌కు, అనంతపురం జిల్లా వీఆర్‌లో ఉన్న నరేంద్రరెడ్డిని నల్లమాడ సర్కిల్‌కు, బుక్కరాయసముద్రం యూపీఎస్‌లో పనిచేస్తున్న శ్రీధర్‌ను రామగిరికి, ఆ సర్కిల్‌లో ఉన్న సీతాంజనేయులును శ్రీసత్యసాయి జిల్లా వీఆర్‌కు బదిలీచేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

స్పెషల్ ఆఫీసర్‌గా కాంతిలాల్‌దండే

అనంతపురం టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి తదితర కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి జిల్లాకు ఓ ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులోభాగంగా అనంత జిల్లాలో పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండేను నియమించారు. ఇకనుంచి ఈయన జిల్లాలో ప్రభుత్వపథకాలు, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు.

ప్రజాసేవే పరిటాల రవీంద్ర ఆశయం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌చార్జి శ్రీరామ్

ఘనంగా జయంతి వేడుకలు


పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, కుటుంబసభ్యులు

రామగిరి, ఆగస్టు 30: ప్రజలకు సేవచేయడమే దివంగత పరిటాల రవీంద్ర ఆశయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు శుక్రవారం వెంకటాపురంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర ఘాట్‌ను ఆయన అభిమానులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్ తమ కుటుంబసభ్యులతో కలిసి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చి పరిటాల అభిమానులతో వెంకటాపురం గ్రామం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిటాల రవీంద్ర చనిపోయి ఇన్నేళ్లు అవుతున్న ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారంటే ఆయన చేసిన ప్రజాసేవే కారణమన్నారు. ఆయన ఆశయాలను పరిటాల శ్రీరామ్ కూడా కొనసాగిస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.


ఎంజేపీ పాఠశాలలో విద్యార్థినులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

బ్యాట్ VS బాల్

- క్రికెట్ అభిమానులకు పండుగ
- జిల్లాలో దులీప్‌ట్రోఫీ నిర్వహణ
- అనంతలో తొలిసారి భారీ టోర్నీ
- ఐదు నుంచి పోటీలు.. ఏర్పాట్లు పూర్తి


అనంతపురం క్రికెట్ గ్రౌండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30: దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు అనంతపురం తొలిసారి వేదిక కానుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రికెట్ పోటీలు సెప్టెంబరు 5 నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ) వేదికగా జరనున్నాయి. దేశంలోని దిగ్గజ క్రికెట్ క్రీడాకారులు జిల్లాకు రానున్నారు. సెప్టెంబరు 5 నుంచి 22 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆర్డీటీ స్టేడియంలో ఇండియా-ఏ, ఇండియా-బీ, ఇండియా-సి, ఇండియా-డీ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.

ఇండియా-ఏ: శుభమన్‌గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్‌జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివం దూబె, తనుష్‌కొటినా, కులదీప్ యాదవ్, ఆకాష్‌దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, అవేష్‌ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుషగ్రా, శావత్ రావత్.

ఇండియా-బి: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్‌పంత్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్, నవ్‌దీప్ సైనీ, రవీంద్ర జడేజా, యష్‌దయాల్, ముకేష్‌కుమార్, రాహుల్‌చాహర్, సాయికిశోర్, మోహిత్‌అవాస్తి, జగదీషన్.

ఇండియా-సి జట్టు: రుత్‌రాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయిసుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, సూర్యకుమార్ యాదవ్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైషాక్ విజయ్ కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్స్‌చౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్.

ఇండియా-డి: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ తైడే, యష్‌దుబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రిక్కీభూయ్, సరాన్ష్‌జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్.

బీసీసీఐ క్యూరేటర్‌తో పిచ్ ఏర్పాటు



దులీప్‌ట్రోఫీకి సంబంధించి పోటీలకు ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. పిచ్ తయారు చేయడానికి బీసీసీఐ క్యూరేటర్ సమందర్‌సింగ్ వచ్చారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన సమందర్‌సింగ్ దులీప్ ట్రోఫీ క్యురేటర్‌గా నియమితులయ్యారు. టర్ఫ్ వికెట్ కింద పిచ్ ఏర్పాటు చేస్తున్నారు. సమందర్‌సింగ్ గత 40 ఏళ్లుగా క్యురేటర్‌గా పని చేస్తున్నారు. 1997లో వరల్డ్‌కప్‌లో క్యురేటర్‌గా పనిచేశారు. గ్వాలియర్ మ్యాచ్‌లో 2010లో సచిన్‌టెండూల్కర్ డబుల్ సెంచరీ చేసిన పిచ్‌ను కూడా సమందర్‌సింగే తయారు చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు కల్పిస్తున్నారు. ఖరీదైన వసతులు కల్పించేందుకు మొత్తం బీసీసీఐ భరిస్తుంది. నగరంలోని మాసినేని గ్రాండ్, అలెగ్జాండర్ హోటల్‌లో రూమ్‌లు బుక్ చేశారు. ఒక్కో జట్టుకు 23 గదులను కేటాయించారు. ఇలా నాలుగు జట్లుకు 92 గదులను అందుబాటులో ఉంచారు. బీసీసీఐ సెలెక్టర్లు, కామెంటేటర్లు, అంపై ర్లు, యాంటీ కరప్షన్ టీం సభ్యులు ఉన్నారు. సెలెక్టర్లు అజిత్ అగార్కర్, సుబ్రతో బెనర్జీ వస్తున్నారు.

నేడు పాసుల జారీ

సెప్టెంబరు 5 నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లో నిర్వహించే బీసీసీఐ దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు సంబంధించిన పాసులు శనివారం ఉదయం అనంత క్రీడాగ్రామంలో జారీ చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్ తెలిపారు. ఒక్కో వ్యక్తికి ఒక పాసు మాత్రమే ఇస్తారన్నారు. ఏ రోజు మ్యాచ్‌కు ఆరోజే పాసులు అందజేస్తారన్నారు. మ్యాచ్ రోజు ఉదయం 8.20 నుంచి లోపలికి అనుమతిస్తారని, ఉదయం 10.30గంటలకు గేటు మూసివేస్తామన్నారు. వాహనాల పార్కింగ్ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సమీపంలో, విఐపీ వాహనాలు అనంత క్రీడాగ్రామంలో అనుమతిస్తామన్నారు. స్టేడియం సమీపంలో స్నాక్స్ కౌంటర్లు, తాత్కాలిక క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చుట్టుపక్కల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఆటగాళ్లకు భోజన వసతి ఇలా..

దులీప్ ట్రోఫీలో పాల్గొనే ఆటగాళ్ల అభిరుచుల ఆధారంగా భోజనం ఏర్పాటు చేయనున్నారు.

బ్రేక్ ఫాస్ట్‌లో...

ఓట్స్, మిల్క్, హనీ, ఫ్రెష్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆమ్లేట్, మష్రూమ్స్ బ్రోసిల్, టమోటా సూప్, బాయిల్డ్ ఎగ్, బేక్‌డ్ బీన్స్ రోస్టెడ్ పోటాటోస్, వెజిటబుల్స్ మల్టీ గ్రెయిన్ బ్రెడ్, పీనట్ బటర్, జామ్, హనీ ఇస్తారు. పోహా, ఉప్మా, ఇడ్లీ, కిచిడీ, దోసె, మిల్లెట్ రోటీస్, లైవ్ జోసీ, ఇండియన్ స్నాక్స్ ఏర్పాటు చేస్తారు. ఇక సాంబారు, చట్నీ, సబ్జీ కర్రీలు ఏర్పాటు చేస్తారు. టీ, కాఫీ, సోయా మిల్క్, హాట్ కోల్డ్ స్కిమ్డ్ మిల్క్ అందుబాటులో ఉంచుతారు.

మధ్యాహ్నం లంచ్‌లో....

స్పించ్ సూప్, అస్పారగస్ సూప్, మిక్స్‌డ్ వెజిటేబుల్ సూప్, మష్రూమ్ క్రీమ్ సూప్, చికెన్ సూప్, టమోటా సూప్ ఉంటుంది. వెజ్, నాన్ వెజ్ సలాడ్‌లో ఏర్పాటు చేస్తారు. ఐస్‌బర్గ్ లెట్యూస్, దానిమ్మ సూప్, బీట్రూట్ సూప్, రెడ్ గ్రేప్స్ సూప్, గోడంబి సూప్‌కు ఆలివ్ ఆయిల్, హనీ ఆప్షన్లు ఉంచుతారు. గ్రీక్ సలాడ్, రష్యన్ సలాడ్, ఆపిల్ క్యాలరీ సలాడ్, టమోటా బేసిల్ సలాడ్, కేసర్ సలాడ్ ఉంటుంది. చిక్ పెన్స్, డైస్డ్ టమోటా, డైస్ ఆనియన్, డైస్డ్ కుకుంబర్, లెమన్ ఉంటాయి. గ్రిల్డ్ చికెన్, గ్రిల్డ్ ఫిష్, తందూరి ఫిష్, రోస్టెడ్ ఫిష్ ఏర్పాటు చేస్తారు. సైనిచ్ కాటేజ్ పన్నీర్ చీజ్, గ్రిల్డ్, తందూరి, రోస్టెడ్ పన్నీర్ ఏర్పాటు చేయనున్నారు. వెజ్ గ్రేవీలో చిక్‌పీ లైట్, సోయా చంక్, బీన్స్ గ్రేవీ, లెంటిల్, తడ్కా, ఎల్లో, బ్లాక్ ఉంటుంది. మిక్స్‌డ్ వెజిటబుల్స్ రోస్టెడ్ వెజిటబుల్స్ ఉంటాయి. బ్రౌన్ రైస్, రెడ్ రైస్, స్టీమ్డ్ రైస్ ఉంటుంది. రోటీ, మిల్లెట్ రోటీ, పుల్కా ఉంటాయి.

ఈవెనింగ్ స్నాక్స్

మల్టీ గ్రెయిన్ బ్రెడ్ చికెన్ సాండ్‌విచ్, మల్టీ గ్రెయిన్ బ్రెడ్ వెజ్ సాండ్‌విచ్, గ్రిల్డ్ చికెన్ టిక్కా, గ్రిల్డ్ పన్నీర్ టిక్కా, టమోటా కెచప్, మింట్ చెట్నీ ఏర్పాటు చేస్తారు. చికెన్, వెజ్ మల్టీ గ్రెయిన్ పాస్తా, మిల్లెట్ రోటీ, పుల్కా, గ్రీన్ లీఫీ గ్రేవీ, పన్నీర్ రజ్మా, డ్రై లేడీస్ ఫింగర్స్ క్యాబేజీ, బీన్స్ గ్రిల్డ్ బ్రోసిల్ మష్రూమ్స్ ఇస్తారు. బనానా, స్ట్రాబెర్రీ జ్యూస్, హనీ బనానా షేక్, టీ, కాఫీ ఇస్తారు.

అన్ని రకాల ఫుడ్స్ ఆలివ్ ఆయిల్‌తోనే చేస్తారు. లెస్ స్పైసీ, లెస్ మసాలా, పాన్ ఫ్రైడ్, నో డీప్ ఫ్రైడ్ పెడ్, నో రీఫైండ్ ఫ్లోర్ ఇవ్వకూడదు. అన్ని రకాల ఫుడ్స్ 65 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉండాలి. ఇక డ్రెస్సింగ్ రూమ్‌లో ఫ్రెష్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్, ఫ్రెష్ జ్యూస్, కోకోనట్ వాటర్ ఉంటాయి. ఇక నైట్ డిన్నర్ ప్లేయర్ల ఆప్షన్లను పరిగణలోకి తీసుకుని తయారు చేస్తారు. ఇతరులు ఇచ్చే ఎటువంటి ఫుడ్స్‌ను ప్లేయర్లుకు ఇవ్వరు.

రాయలసీమ రుచులకు ప్రాధాన్యం

రాయలసీమలో లభించే రుచులను ప్లేయర్లకు ఇవ్వనున్నారు. ముఖ్యంగా నాటుకోడి, రాగి ముద్ద, చెట్నీ-రాగిముద్ద వంటి వాటితోపాటు ప్లేయర్లు ఇచ్చే ఆప్షన్ల ప్రకారం అందివ్వనున్నారు.

కనులపండువగా కుబేరలక్ష్మి వ్రతం


లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో కుబేరలక్ష్మి, వరలక్ష్మి వ్రతాలను కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆర్ఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరం, శారదానగర్ శృంగేరి శంకరమఠంలలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహికంగా కుబేర లక్ష్మీ వ్రతాలను ఆచరించారు. మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు.


వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు


శ్రీకృష్ణుడి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో అరవిందనగర్‌లో 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కృష్ణాష్టమి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఐదురోజులపాటు పూజలందుకున్న కృష్ణభగవానుడి ప్రతిమకు తుది పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రతిమను పల్లకిలో ఆశీనులు గావించి, అరవిందనగర్ నుంచి విద్యుత్ సర్కిల్, హౌసింగ్‌బోర్డు, ఓబులదేవరనగర్ మీదుగా తిరిగి అరవిందనగర్‌లోని కృష్ణ మండపం వరకు నగరోత్సవాన్ని నిర్వహించి వేడుకలను ముగించారు. 2వ పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక అనంతపురం కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, శ్రీనివాసులు, రాఘవ, గురుస్వామి, లలిత, గోపాలరాజు, రాధిక, ఇందిర, మాధవి, భార్గవాచారి, సుంకిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో అమ్మవారు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవత కొల్లాపురమ్మదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించిన అనంతరం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను చేశారు. అనంతరం శిఖర, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: సమాజంలో ప్రతిఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగుండడంతోపాటు ఇతరులకు అవగాహన కల్పించేలా ఉండాలని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల బాటనీ హెచ్ఓడీ మాధవి అన్నారు. శుక్రవారం ఝాన్సీ లక్ష్మీబాయి కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఝాన్సీ లక్ష్మీబాయి సీబీఓ పీడీ నాగమణి, కోఆర్డినేటర్ భారతి, కళాశాల సిబ్బంది పద్మావతి, మహేష్, జయలక్ష్మి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు..

అనంతపురం టౌన్: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన పెంచే కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు కొనసాగించారు. మొదటిబహుమతి విజేతలుగా గుంతకల్లుకు చెందిన విద్యార్థులు నందిత, మదిహా ఇమాన్, ద్వితీయస్థానం పామిడికి చెందిన మహీదర్, సంపత్‌కుమార్, తృతీయ బహుమతి కొర్రపాడు గురుకుల విద్యార్థులు శిరీషా, భవిష్య నిలిచారు. విద్యార్థులకు డాక్టర్ అనుపమ జేమ్స్ నగదు బహుమతులు అందజేసి ప్రశంసాపత్రాలు ఇచ్చి అభినందించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ రమణ పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందిస్తాం


సురక్షిత నీరు అందిస్తున్న మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి

రాప్తాడు, ఆగస్టు 30: ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామని మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి అన్నారు. మండలంలోని రామినేపల్లి గ్రామంలో శుక్రవారం వాటర్‌ప్లాంట్ ప్రారంభించారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


ఎంజేపీ పాఠశాలలో మొక్కనాటి నీరుపోస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

రామగిరి, ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో డ్వామా, అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పరిటాలసునీత మాట్లాడుతూ అనంతపురం జిల్లా వంటి కరువు ప్రాంతంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అటవీశాఖ అధికారులు, డ్వామా అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షిస్తే అవి మనల్ని సంరక్షిస్తాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్ పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

వైద్యశాఖలో వనమహోత్సవం

అనంతపురం టౌన్: జిల్లావైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి చేతులమీదుగా మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ హరిత అనంత కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ జేమ్స్, ఏఓ గిరిజా మనోహర్, త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.


సర్వజన ఆస్పత్రి ఆవరణలో మొక్కనాటి నీరుపోస్తున్న డీఎంహెచ్ఓ

మొదలైన ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా

● కూడేరుకు 300 క్వింటాళ్ల విత్తనాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 30: జిల్లాలోని మండలాలకు ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా మొదలైంది. శుక్రవారం కూడేరు మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలకు 300 క్వింటాళ్ల ఉలవలు సరఫరా చేశారు. శనివారం నార్పల మండలానికి మరో 300 క్వింటాళ్ల ఉలవలు పంపనున్నట్లు ఏపీసీడ్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో సాగు చేయలేకపోవడంతో జిల్లాకు 27,907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1,501, అలసంద 3,253, జొన్న 973, కొర్ర 369, మినుములు 20 క్వింటాళ్లను కేటాయించారు. 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటి దాకా 11 మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 170 మంది రైతులు 300 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాల కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్బీఐ విడుదల చేసిన రూ.10 నాణేలను బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్లు లేదా బస్సుల్లో కండక్టర్లు నిరాకరిస్తున్నారన్నారు. అలా నిరాకరించడం నేరం అని, నాణేలు అన్నిచోట్ల స్వీకరించేలా సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆర్ఎం స్పందిస్తూ సమస్యలపై సిబ్బందితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సాంబశివుడు, టీవీరెడ్డి, సుబ్బరాయుడు, కేఎల్ఎన్ ప్రసాద్, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విభాగాల పరిశీలన

అనంతపురంరూరల్, ఆగస్టు 30: విద్యుత్ శాఖ పరిధిలోని పలు విభాగాలను ఐఎస్ఓ ఆడిట్ ఆర్గనైజేషన్ సభ్యులు కేఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని జిల్లా స్టోర్, ఎస్ఈ ఆఫీస్, ఎంఅండ్‌పీ-2 డివిజన్ కార్యాలయం, పవర్ ఆఫీస్‌లోని మీటర్ టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. టెక్నికల్ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30: జిల్లా సబ్‌జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు సెప్టెంబరు 1న కళ్యాణదుర్గంలోని కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి తెలిపారు. 2010 ఏప్రిల్ 1 తరువాత జన్మించిన బాల, బాలికలు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9652117133 నంబరును సంప్రదించాలని కోరారు.

హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో చోటు చేసుకున్న హిడెన్ కెమెరాల ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాలలో గురువారం అర్ధరాత్రి విద్యార్థినులు హాస్టల్‌లో హిడెన్ కెమెరాలున్నాయంటూ ఆందోళనకు దిగారన్నారు. యాజమాన్యం పర్యవేక్షణాలోపం దీనికి ప్రధాన కారణమన్నారు. ఉన్నత చదువులకోసం కళాశాలలకు వస్తున్న విద్యార్థుల నుంచి పెద్దమొత్తాల్లో ఫీజులు వసూలు చేయడమే తప్ప వారి రక్షణ గురించి యాజమాన్యాలు ఎలాంటి చొరవ చూపడం లేదని విమర్శించారు. బాధ్యులు ఎంతటివారైన కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు 30: నగర శివారులోని తపోవనంలో నివాసముంటున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు తపోవనంలో శివరాం, వెంకటలక్ష్మి(34) దంపతులు నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. వెంకటలక్ష్మి జాబ్ చేస్తానని చెబుతుండేది. అది ఇష్టంలేని శివరాం ఎందుకు అంత ఒత్తిడి తీసుకుంటావ్ అని సర్దిచెప్పేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరి మధ్య ఇదే విషయంపై వాగ్వాదం జరిగింది. శివరాం బయటకు వెళ్లిన సమయంలో వెంకటలక్ష్మి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దనే పింఛన్లు అందించాలి: ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఆగస్టు 30: అనంతపురం అర్బన్ పరిధిలోని ప్రతి ఒక్క పింఛన్‌దారుడికి ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పింఛన్‌దారులకు సక్రమంగా డబ్బు పంపిణీ చేయాలన్నారు. ఈసారి ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. పార్టీ శ్రేణులు తమ డివిజన్ పరిధిల్లో పింఛన్ల పంపిణీలో భాగస్వాములు కావాలని సూచించారు.

పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా వెంకటస్వామి

అనంతపురం అర్బన్, ఆగస్టు 30: పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా (ఎఫ్ఏసీ) వెంకటస్వామి నియమితులయ్యారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ జేడీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం శనివారం పదవీ విరమణ పొందనున్నారు. పెనుకొండ గొర్రెలు, మేకల పెంపక క్షేత్రం డీడీ వెంకటస్వామికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరికొన్ని రోజుల్లో ఉద్యోగోన్నతిపై డీడీ వెంకటస్వామి రెగ్యులర్ జేడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో సుబ్రహ్మణ్యానికి పదవీ విరమణ వీడ్కోలు సభ నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులను పొట్టన పెట్టుకుంటున్నరైల్వే అధికారులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ దళిత వర్గాల ఉద్యోగులపై వివక్ష తప్పడంలేదని, సహోద్యోగులన్న భావనలేకుండా రైల్వే శాఖలో ఉన్నతాధికారులు పొట్టన పెట్టుకుంటున్నారని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మండిపడ్డారు. రైల్వే ఉద్యోగి మాల నాగమణి ఆత్మహత్యకు కారకులైన అధికారులను శిక్షించాలని అదనపు ఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదుచేశారు. సుగమంచి శ్రీనివాసులు, ఓబులేసు, రామకృష్ణ, నారాయణస్వామి, రమేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: బెంగళూరుకు చెందిన దినేష్ నీలకంఠ్ సహకారంతో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మఒడి వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో చాలామంది సంపాదన మోజులో పడి తమ తల్లిదండ్రులను విస్మరిస్తున్నారన్నారు. ట్రస్టు సభ్యులు నారాయణ నాయక్, రాఘవేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 30: అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబాని పోషించుకోలేని స్థితిలో ఉన్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించి అమ్మ సంస్థ అండగా నిలిచింది. పాతూరుకు చెందిన బోయ మారుతిప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య సునీత, కుమార్తెలు లక్ష్మీప్రణీ, దక్షిత ఉన్నారు. గతేడాది మారుతిప్రసాద్‌కు గుండెపోటు రావడంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చూపించగా గుండె బలహీనంగా ఉందని, మందులతోనే జీవనం సాగించాలని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు అమ్మ సంస్థను ఆయన ఆశ్రయించారు. సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మారుతీప్రసాద్ కుటుంబానికి రూ.70వేలు ఆర్థిక సాయం అందజేశారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం టౌన్, ఆగస్టు 30: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. శుక్రువారం జిల్లావైద్యశాఖ కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో ఫార్మసీ ఉద్యోగులు సమావేశమయ్యారు. జిల్లాకమిటీని ఎన్నికల అధికారిగా కడపకు చెందిన డాక్టర్ సిద్ధయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల మాధవ, ప్రధానకార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా చెన్నైశెట్టి, అసోసియేట్ గౌరవాధ్యక్షుడిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, సరస్వతమ్మ, ఫయాజ్,కుల్లాయిబాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఉమామహేష్, సంయుక్త కార్యదర్శులుగా రాంబాబు, నల్లప్ప, విశ్వనాథ్ నియమితులయ్యారు.

దరఖాస్తుల పరిశీలన

అనంతపురం విద్య, ఆగస్టు 30: సమగ్ర శిక్ష ప్రాజక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ కోసం వచ్చిన దరఖాస్తులు ప్రాజక్టు అధికారులు, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు స్క్రూటినీ చేశారు. శుక్రవారం ప్రాజక్టు కార్యక్రమంలో దరఖాస్తుల సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్లను స్క్రూటినీ కోసం నియమించిన అధికారులు పరిశీలించారు. 36 మందిలో 32 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

అడిషనల్ ఎస్పీగా తాడిపత్రి డీఎస్పీ



తాడిపత్రి, ఆగస్టు 30: తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈయన ఎన్నికల సమయంలో డీఎస్పీగా ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ప్రమోషన్‌పై అడిషనల్ ఎస్పీగా వెళ్లనున్నారు. విజయవాడకు రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు వచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్ రెడ్డి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించండి: కలెక్టర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 30: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. రోటరీపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉందా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పిల్లలకు పెట్టే భోజనం మెనూను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా అని ప్రధానోపాధ్యాయరాలిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా భోజన పథకాన్ని తనిఖీ చేయాలని చేయాలని జిల్లా డీఈఓ వరలక్ష్మిని ఆదేశించారు. డైనింగ్ హాల్ నిర్మాణానికి పతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఏపీసీ నాగరాజు, ఎంఈఓ నవీదా ఎంపీడీఓ తేజ్యోత్స్న పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు


కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటున్న బాలకృష్ణ అభిమానులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 30: నందమూరి బాలకృష్ణ సినీ ప్రస్థానం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన అభిమాన సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. సంఘం నాయకులు శ్రీధర్, మోక్షజ్ఞ, చిరంజీవి, శంకర్, ముత్యాలు, రాజేష్, బాలకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయాధికారి


ఖైదీతో మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఆగస్టు 30: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో సంభాషించి, జైలులో అందుతున్న సౌకర్యాలు, ఆహారం, నివాసం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఖైదీలకు న్యాయసేవల లభ్యత, అప్పీల్ హక్కు, అభ్యర్థన బేరసారాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్, సిస్టమ్ పనితీరు గురించి వివరించారు.

సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు ఆగవు


నిరసన తెలుపుతున్న కార్మికులు

గార్లదిన్నె, ఆగస్టు 30: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు ఆగవని సత్యసాయి తాగునీటి పథకం కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. బకాయి వేతనాలు చెల్లించి తమ సమ్యలు పరిష్కరించాలని పదిరోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం కల్లూరు పంపుహౌస్ వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకులు బాషా, నాగభూషణం, మల్లరాయుడు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, సాంబశివ, నాగవర్ధన్, శంకర్, ఈశ్వరయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం

ఆత్మకూరు ఆగస్టు 30: ఎన్నికలు ముందు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను మండల కేంద్రంలోని ప్రజలు కోరారు. వారి విజ్ఞప్తి మేరకు శుక్రవారం పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకొని తాగునీటి పైపులైను పనులు టీడీపీ గ్రామ నాయకులు ప్రారంభించారు. గ్రామంలోని హైస్కూల్ కాలనీ, బీసీ కాలనీ వాసులు ఇంటింటా తాగునీటి సమస్య తీరునుందని నాయకులు పేర్కొన్నారు. టీడీపీ మాజీ కన్వీనర్ వేణుగోపాల్, ప్రతాప్, కందుల ఓబులపతి, అక్కులన్న, రవీంద్రారెడ్డి, కార్తీక్, నందన్, తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తు గుడువు పొడిగించాలి

అనంతపురం విద్య, ఆగస్టు 30: జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 2024-25 ఏడాదికి సంబంధించిన అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 5 నుంచి 8వ తరగతి వరకూ 189 సీట్ల భర్తీ చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో మరికొందరు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోడానికి అవకాశం లభించిందన్నారు. ఈ అదనపు సీట్ల భర్తీకి ప్రభుత్వం కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చిందన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తుకు మరింత గడువు పెంచేలా కలెక్టర్, డీసీఓ చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు శని త్రయోదశి పూజలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 29: శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం చెరువుకట్ట వద్దనున్న జ్యేష్టాదేవి సమేత శనీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు బాబాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకకల్యాణంకోసం గణపతి, కలశ, నవగ్రహ పూజలు నిర్వహిస్తామన్నారు. శనిదోష నివారణకోసం శనీశ్వరునికి తైలాభిషేకం, శనిశాంతి హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్ఫూర్తిదాత పల్లె ఉమా: పల్లె


పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురం రూరల్, ఆగస్టు 30: సామాన్య గృహిణాగా జీవితం ప్రారంభించిన పల్లె ఉమా బాలాజీ విద్యా సంస్థల అధినేతగా, రాజకీయరంగంగా, సంఘసేవకురాలుగా సేవాలందించిన స్ఫూర్తిదాత అని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి అన్నారు. ఆయన సతీమణి పల్లె ఉమా ఆరో వర్ధంతిని కక్కలపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఆమె ఘాట్ వద్ద నిర్వహించారు. పల్లె రుఘునాథరెడ్డితోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, శ్రీబాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిశోర్ రెడ్డి, మనవరాలు, మనవడు వన్స్ వియాన్, కుటుంబ సభ్యులు మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, సతీమణి సౌభాగ్యరాణి తదితరులు ఘన నివాళి అర్పించారు. పల్లె మాట్లాడుతూ పల్లె ఉమా ఆదర్శ గృహిణిగా గొప్ప దార్శనికురాలుగా ఎంతో మంది విద్యార్థులకు విద్య అవకాశం కల్పించిందన్నారు. పల్లె ఉమా వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40మంది రక్తదానం చేశారు. శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో రాఘవేంద్ర వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందించారు. పల్లె ఉమకు నివాళి అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, సీపీఐ రాష్ట్ర నాయకులు జగదీష్, మాజీ మేయర్ స్వరూప, టీడీపీ సీనియర్‌నాయకులు గడ్డంసుబ్రమణ్యం, కేశవరెడ్డి, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఆచార్య సుదర్శన్‌రావ్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ అధ్యక్షులు హేమచంద్రారెడ్డి తోపాటు పల్లె సోదరులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు రమేష్‌బాబు, సుబ్బారావు, మన్మదేశ్వరరెడ్డి ఉన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

రామగిరి, ఆగస్టు 30: పరిటాలరవీంద్ర జయంతి, సేవ కార్యక్రమాలు గ్రామాల్లోనే కాక జిల్లావ్యాప్తంగా ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పరిటాలరవీంద్ర సోదరి ఉష ఘాట్ వద్ద అభిమానులకు మిఠాయిలు పంచిపెట్టగా, పరిటాల కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. గంగంపల్లి సెంటర్ వద్ద గరుత్మంతుని విగ్రహాన్ని ప్రారంభించి పూజలు నిర్వహించారు. అనంతరం ఎంజేపీ గురుకుల పాఠశాలలో 580మంది విద్యార్థినులకు స్టీల్ వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేశారు. పరిటాలరవీంద్ర అభిమానులు మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు 50వేల వ్యయంతో బీరువా, తాగునీటి ఫ్రిజ్, మాజీ ఎంపీపీ రంగయ్య సొంతనిధులతో బీరువా, స్పోర్ట్స్ మెటీరియల్స్‌ను అందజేశారు. అంతకుముందు వెంకటాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జూనియర్ పరిటాలరవీంద్ర, అమైరా రవీంద్ర చేతులమీదుగా స్టీల్‌వాటర్ బాటిల్స్‌ను అందించారు.

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలో పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్కేయూ ముఖద్వారం వద్ద పరిటాల చిత్రపటానికి ఘన నివాళులర్పించి కేకును కట్‌చేశారు. నాయకులు వాల్మీకి అనీల్, కిరణ్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలో పరిటాల రవీంద్ర జయంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఆకుతోటపల్లి గ్రామంలో అమ్మఒడి ఆశ్రమంలో కేక్‌కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సిండికేట్‌నగర్‌లో స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. సోములదొడ్డి గ్రామ సమీపంలోని ఐఎంఎల్ డిపో ఎదుట హమాలీలు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, పాముురాయి రఘు, జయకృష్ణ, రాగేమురళీ మోహన్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంకేఅమరేంద్ర, మాడెంసూర్యనారాయణరెడ్డి, ముత్యాలప్ప, యజ్ఞేశంకర్, రామకృష్ణారెడ్డి, ఏపీశ్రీనివాసులు, బండి ఆంజనేయులు పాల్గొన్నారు.

రాప్తాడు: పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు టీడీపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. 67వ జయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, ఎంపీటీసీ జాఫర్, గంగలకుంట రమణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): మండలవ్యాప్తంగా పరిటాలరవీంద్ర జయంతిని అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్, కన్వీనర్ యాతంపోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సుధాకర్‌చౌదరి, బిల్లేభాస్కర్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని పాముురాయి గ్రామంలో పరిటాల రవీంద్ర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాముురాయి శ్రీనివాసులు, రాము, విశ్వనాథ్, సుబ్బారావు, రాంబాబు, రామాంజనేయులు పాల్గొన్నారు. సిండికేట్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, ఎంపీటీసీ క్రిష్ణరెడ్డి, మాజీ ఎంపిటీసీ సర్దానప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలో పరిటాల రవీంద్ర జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పి.సిద్దరాంపురం గ్రామంలో వంద కేజీల కేక్‌ను నాయకులు కట్ చేశారు. ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నారాయణస్వామి, శశాంకచౌదరి, మనోరంజన్, కందుల ఓబుళపతి, రవీంద్రారెడ్డి, శ్రీనివాస చౌదరి పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టీల్‌వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న జూనియర్ పరిటాల రవీంద్ర, అమైరా రవీంద్ర


అనంతపురం రూరల్: ఆకుతోటపల్లిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు


ఎస్కేయూలో...



కనగానపల్లిలో...


చెన్నేకొత్తపల్లిలో...


ఆత్మకూరులో వంద కిలోల కేక్ కట్ చేస్తున్న నాయకులు

జీడిపల్లికి 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 30: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.626 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 30: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యసిబ్బందికి తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, ఎంపీపీ మాధవి సూచించారు. మండలంలోని నాగసముద్రం గ్రామ పీహెచ్‌సీలో శుక్రవారం హెచ్‌డీఎస్ కమిటీ సమావేశాన్ని వైద్యాధికారి డాక్టర్ నవీన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంపీపీ పాల్గొని ఆస్పత్రిలో వసతులపై వైద్యులు, సిబ్బందితో చర్చించారు. పీహెచ్‌సీలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ గుర్తింపు

ఉరవకొండ, ఆగస్టు 30: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19, 20వ తేదీల్లో న్యాక్ బృందం కళాశాలలో పర్యటించిందని, ఈ క్రమంలో వారు కళాశాలపై ఇచ్చిన నివేదికల మేరకు ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఏ గ్రేడ్ గుర్తింపుతో కళాశాలకు అటానమస్ హోదా రావడానికి అవకాశముంటుందన్నారు. నిధుల కేటాయింపులో కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే అవకాశముంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మస్తానయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు

ఉరవకొండ, ఆగస్టు 30: పట్టణంలోని బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలలో భాగంగా జియారత్‌ను నిర్వహించి, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో అమ్మవారికి చాదర్‌ను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్గాను దర్శించుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. గురువారం అర్ధరాత్రి షంషేర్‌ను పట్టణంలోని వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ ఎస్ఐగా నబీరసూల్ బాధ్యతలు

బొమ్మనహాళ్, ఆగస్టు 30: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా నబీరసూల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేస్తున్న శ్రీనివాసులు కర్నూలు జిల్లా నందవరానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలోకి గుత్తిలో ఎస్ఐగా పనిచేస్తున్న నబీరసూల్ వచ్చారు.

కణేకల్లు ఎస్ఐగా నాగమధు..

కణేకల్లు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా నాగమధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నాలుగోపోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ల బాధ్యతలు

బెళుగుప్ప, ఆగస్టు 30: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కళ్యాణదుర్గం తహసీల్దార్ నాగరాజు బాధ్యతలు చేపట్టారు. స్థానిక అధికారులు స్వాగతం పలికారు. పంటల నమోదుతో పాటు కౌలు రైతుల కార్డుల మంజూరును వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన వీఆర్వోలకు సూచించారు.

తాడిపత్రి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాలాజీ బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో పనిచేస్తున్న అంజనేయులు బదిలీపై వెళ్లడంతో పెద్దపప్పూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న బాలాజీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కూడేరుకు 300 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 30 : జిల్లాలోని మండలాలకు ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా మొదలైంది. ఈ క్రమంలో శుక్రవారం కూడేరు మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలకు 300 క్వింటాళ్ల ఉలవలు సరఫరా చేశారు. అలాగే శనివారం నార్పల మండలానికి మరో 300 క్వింటాళ్ల ఉలవలు పంపనున్నట్లు ఏపీసీడ్స్ అధికారులు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ఆధారంగా నిర్దేశించిన మండలాలకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపనున్నట్లు వారు తెలిపారు.

మరో ఐదుగురి అరెస్టు

యాడికి, ఆగస్టు 30: మండలంలోని బోయరెడ్డిపల్లిలో గొడవకు సంబంధించి మరో ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బోయరెడ్డిపల్లిలో ఈనెల 15వ తేదీన రస్తా విషయమై ఇరువర్గాల వారు గొడవపడి రాళ్లు, కట్టెలతో దాడిచేసుకున్నారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదుచేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఒక వర్గానికి చెందిన 14మందిని ఈనెల 17న అరెస్టు చేశామన్నారు. ఇదే వర్గానికి చెందిన మరో ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేశామని తెలిపారు. మరొక వర్గానికి చెందిన 9మందిని ఈనెల 27న అరెస్టు చేసిన విషయం విధితమే.

బాల్యవివాహాలు నేరం

యాడికి, ఆగస్టు 30: బాల్యవివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. మండల కేంద్రం లోని అంబేడ్కర్‌కాలనీలో శుక్రవారం వారు న్యాయసేవా సదస్సు నిర్వహించి న్యాయసేవలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాలు ప్రోత్సహించినా శిక్షార్హులే అని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రజల సహకారం ఉండాలని కోరారు. సదస్సులో ఎంఈఓ-2 ధనలక్ష్మి, ఏఎస్ఐ వెంకటేష్, ఆర్ఐ ఆనంద్‌బాబు ఆచారి, వీఆర్వో రమేష్, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి, ఆగస్టు 30: మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో గల సచివాలయం వీధిలో నివాసం ఉంటున్న నాగమద్దిలేటిపై శుక్రవారం కేసునమోదు చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. నాగమద్దిలేటి రెండురోజులుగా కాలనీలో ఇళ్ల వద్ద నిలబడి మహిళలను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడుతుండడంతో పాటు పలువురిపై బండరాళ్లతో దాడిచేస్తున్నట్లు కాలనీవాసులు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు అతడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

టీడీపీ మండల కన్వీనర్‌కు తీవ్రగాయాలు

యాడికి, ఆగస్టు 30: ఇంటిపైకి ఎక్కుతూ నిచ్చెనపై నుంచి జారిపడడంతో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ సంఘటన శుక్రవారం పెద్దపేట గ్రామంలో జరిగింది. తీవ్రగాయాలపాలైన అయనను యాడికిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సమాచారం అందుకున్న పలువురు టీడీపీ నాయకులు అనంతపురం వెళ్లారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● వనమహోత్సవంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు

రాయదుర్గం, ఆగస్టు 30: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తే.. అది మనల్ని కాపాడుతుందన్నారు. చెట్లుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కనుక ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఆర్వో దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కళ్యాణదుర్గం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను తప్పక నాటాలన్నారు. అంతే కాకుండా నీరు పోసి సంరక్షించే బాధ్యతను చేపట్టాలని కోరారు. పచ్చదనం పెంపొందింతేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. కనుక పర్యావరణ పరిరక్షణకు అందరం పాటు పడదామని పిలుపునిచ్చారు.

కణేకల్లు: కణేకల్లు క్రాసింగ్‌లో గల గురుకుల పాఠశాల ఆవరణలో వనం - మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుయువత మండల అధ్యక్షుడు బాయినేని నవీన్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్: పట్టణంలోని కొత్త కంపోస్టు యార్డు రోడ్డులో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, చైర్‌పర్సన్ ఎన్ భవాని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. కనుక ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరా రు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలావతి, మున్సిపల్ ఇంజనీర్ గురప్ప, డీఈ హేమచంద్ర, ఏఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నా రు. అలాగే పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గుత్తి రేంజ్ అటవీ అధికారి మధుబాబు, పామిడి సెక్షన్ ఎఫ్ఎస్ఓ కరీముల్లా, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. ఫారెస్ట్ బీట్ అధికారులు చంద్ర, రాజేశ్వరి, వైస్‌ప్రిన్సిపాల్ ఓ బులేసు అధ్యాపకులు పాల్గొన్నారు. ఇక మండలంలోని నెలగొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాఠశాలఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేవ సొసైటీ రాష్ట్ర కోశాధికారి వీరాంజనేయులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



సెంట్రల్ యూనివర్సిటీలో మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎన్ఎంయూ

తాడిపత్రి, ఆగస్టు 30: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలం టూ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రీజనల్ కార్యదర్శి ప్రతాప్‌నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కండెక్టర్లకు, డ్రైవర్లకు రాత్రి డ్యూటీలకు సంబంధించిన అలవెన్సులను పునరుద్ధరించాలన్నారు. పీటీడీ సర్వీసులో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలను చెల్లించాలన్నారు. జీఓ 114లోని అలవెన్సులు అమలుచేయాలన్నారు. మెడికల్ రీ యింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో డిపో ప్రెసిడెంట్ కేజీఎస్ బాబు, సీనియర్ సభ్యులు నాగేశ్వరరెడ్డి, రామకృష్ణ, ఎస్ఆర్‌కే రెడ్డి, వేణుగోపాల్, సుబ్బారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని నేషనల్ మజ్దూరు యూనియన్ అసోసియేషన్ నాయకులు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్వై స్వామి , డిపో అధ్యక్షుడు ఏఎల్ఎన్ గౌడ్, కార్యదర్శి నటరాజ్, గ్యారేజ్ కార్యదర్శి వెంకటరమణ, సీనియర్ నాయకులు రహంతుల్లా, వన్నూరప్ప, ఖలీల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పీటీడీ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలు, అరియర్స్ చెల్లించాలని పట్టణంలోని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, ఎర్రిస్వామి, వలి, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

డీ.హీరేహాళ్, ఆగస్టు 30: మురడి గ్రామంలో గత గురువారం భార్య శివగంగమ్మ, భర్త పంపాపతి మృతి చెందడంతో వారి ముగ్గురి పిల్లలు అనాథలైన విషయం తెలిసిందే. దీంతో కాలవ శ్రీనివాసులు సతీమణి విజయమ్మ శుక్రవారం గ్రామానికి వెళ్లి అనాథలైన ముగ్గురు పిల్లలను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందంచారు. అలాగే ఎంపీటీసీ గంగాధర రూ. 5 వేలను అందజేశారు. అనంతరం అదే గ్రామంలో బోయ బొజ్జక్క మృతి చెందగా .. కాలవ విజయమ్మ వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సా యం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధిని చేకూరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దమడి వెంకటరెడ్డి, బంగి శంకర్, పరంధామ, చన్నవీర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జక్క కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న కాలవ విజయమ్మ

పాఠశాల కోసం స్థల పరిశీలన

ఉరవకొండ, ఆగస్టు 30: బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల నిర్మాణం కోసం పట్టణ శివారులోని రాయంపల్లి లేఅవుట్ సమీపంలో ఉన్న స్థలాన్ని డీటీడబ్ల్యూవో రామాంజనేయులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా శుక్రవారం పరిశీలించారు. అంతకుమునుపు బాలికల గిరిజన ఆశ్రమపాఠశాలను వారు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 6 బాలురు, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఉరవకొండలో మాత్రం ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. భవన నిర్మాణం కోసం చిన్నముష్టూరు మోడల్ స్కూల్ సమీపంలో స్థలాన్ని కేటాయించగా అక్కడ అనువుగా లేదన్నారు. ప్రత్యామ్నాయంగా మరో స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణాదేవి, మండలసర్వేయర్ రత్నాకర్, టీడీపీ నాయకులు కేశవ్ నాయక్ పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ ప్రాంతాల పరిశీలన

తాడిపత్రి, ఆగస్టు30: మండలంలోని సజ్జలదిన్నె, వీరాపురం, చుక్కలూరు తదితర గ్రామాల్లో అక్రమంగా ఇసుకను నిల్వచేసే ప్రాంతాలను రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కడప రహదారిలోని అర్జాస్ స్టీల్‌ప్లాంట్ ఎదురుగా అక్రమ ఇసుక డంపింగ్‌ను గుర్తించి సీజ్‌చేశారు. అనంతరం ఈ ఇసుకను మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించారు. తర్వాత ఈ గ్రామాల్లో నుంచి పెన్నానదిలోకి వెళ్లకుండా దారులను మూసివేయించారు. అనంతరం మాట్లాడుతూ తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలూరు, వీరాపురంలో పర్యటన

మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలైన ఆలూరు, వీరాపురంలో సీఐ శివగంగాధర్‌రెడ్డి పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలకు దిగితే ఎంతటివారైనా ఉపేక్షించమని హెచ్చరించారు.ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

అడిషనల్ ఎస్పీగా తాడిపత్రి డీఎస్పీ

తాడిపత్రి, ఆగస్టు 30: తాడిపత్రి డీఎస్పీగా పనిచేస్తున్న జనార్దన్‌నాయుడు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈయన ఎన్నికల సమయంలో డీఎస్పీగా ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ప్రమోషన్‌పై అడిషనల్ ఎస్పీగా వెళ్లనున్నారు. విజయవాడకు రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు వచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



జనార్దన్‌నాయుడు, డీఎస్పీ

15లోపు ఈ పంట నమోదు పూర్తవ్వాలి

కళ్యాణదుర్గం, ఆగస్టు 30: ఈ పంట నమోదు ప్రక్రియను సెప్టెంబరు 15వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. కళ్యాణదుర్గం, శెట్టూరు మండలాల్లో రైతు సేవా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈ పంట నమోదు కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అదేవిధంగా ఈ పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

పంటల పరిశీలన

కళ్యాణదుర్గం(శెట్టూరు): శెట్టూరు మండల కేంద్రంలోని పలు పంటలను జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఖరీఫ్‌లో వర్షాధారంగా, బోరుబావుల కింద సాగు చేసిన ఆముదం, కంది, వేరుశనగ, వరి, టమోట పంటలను పరిశీలించారు. పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఇన్‌చార్జి ఏఓ జగదీష్ బాబు, ఏఈవో అంజనేయులు, రైతుసేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

యాడికి, ఆగస్టు 30: మద్యం మానేయమని తల్లి మందలించడంతో మండలకేంద్రంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని కొండకింద వీధికి చెందిన అచ్చమ్మ, రంగనాయకుల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు రాజశేఖర్ (22) సంతానం. రంగనాయకులు ఏడేళ్లక్రితమే మృతిచెందాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహమైంది. అచ్చమ్మ కూలి పనులకు వెళ్లేది. రాజశేఖర్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. కాగా రాజశేఖర్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడం మానుకోవాలని తల్లి తరచూ మందలిస్తుండేది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటివద్ద ఉన్న అతడిని మద్యం తాగడం మానుకొని, పనులు సక్రమంగా చేసుకోవాలని తల్లి మందలించి పొలం పనులకు వెళ్లింది. మనస్తాపం చెందిన రాజశేఖర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించామన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

కళ్యాణదుర్గం (కంబదూరు), ఆగస్టు 30: కంబదూరు మండలంలోని చెన్నంపల్లి ఇసుక రీచ్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండడాన్ని గమనించిన గ్రామస్థులు వెళ్లి అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయకూడదంటూ వాదులాటకు దిగారు. దృశ్యాలను పలువురు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఏ పార్టీ వారు కూడా ఇసుకను అక్రమంగా రవాణా చేయకూడదని గ్రామస్థులు అడ్డుపడ్డారు. అధికారుల అనుమతి తీసుకుని రవాణా చేయాలే గానీ.. ఇలా అక్రమంగా రవాణా చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తర్వాత ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

వైభవంగా ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవం

ఉరవకొండ, ఆగస్టు 30: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో శుక్రవారం ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలో ఉంచారు. ఉదయం మడుగుతేరును నిర్వహించారు. సాయంత్రం ఉట్ల ఉత్సవం, తర్వాత రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెన్నహోబిలంలో ఉట్ల పరుష

మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉట్లపరుషను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆవరణలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువకులు ఉట్టికొట్టేందుకు ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఆలయ సిబ్బంది మారుతి, దీపక్, అర్చకులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేమకల్లు అంజన్నకు విశేషపూజలు

బొమ్మనహాళ్, ఆగస్టు 30: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికిలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విశేషపూజలు ఘ నంగా జరిగాయి. వేకువజామునే స్వామివారికి ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సం తోష్ కుమార్ చార్యులు సుప్రభాతసేవ, పం చామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరణలు చేశారు. తర్వాత విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు, శ్రీ రామచంద్రులవారికి పట్టాభిషేకం జరిపించి, నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు. ఈఓ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ

విడపనకల్లు, ఆగస్టు 30: మండల కేంద్రంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులను ఏఓ పెన్నయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులోని భాగంగా గవి సిద్దేశ్వర ఆగ్రో ఏజెన్సీ, అమృత ఏజెన్సీ, సాయి సిద్దేశ్వర ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గవి సిద్దేశ్వర ఫర్టిలైజర్స్‌లో రికార్డులు సరిగా లేక పోవటంతో రూ. 58వేలు విలువ చేసే పురుగు మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో గాయత్రీమాత

తాడిపత్రి, ఆగస్టు 30: శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సంజీవనగర్ మొదటిరోడ్డులో ఉన్న వేదమాత గాయత్రీదేవి, అమరలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. గాయత్రీదేవి అమ్మవారు గాజుల అలంకరణలో పూజలందుకున్నారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు పొందారు.



గాజుల అలంకరణలో గాయత్రీమాత

కసాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 30: శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయ ప్రాంగణంలో లక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. అనంతరం మహిళలచేత సామూహికంగా వ్రతాన్ని జరిపించారు. తర్వాత ఆలయంలో పునర్వసు తిరునక్షత్రం సందర్భంగా సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 30 : గత వైసీపీ హయాంలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఏ మాత్రం బెదరకుండా టీడీపీ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అధికారంలోకి రావడానికి విశేష కృషి చేసిన నియోజకవర్గంలోని పలువురు ఉత్తమ కార్యకర్తలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రశంసాపత్రాలను అందించారు. పట్టణంలోని ప్రజా వేదిక వద్ద శుక్రవారం ఆయన ప్రశంసాపత్రాలను అందజేసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీకి మీ కృషి ఇలాగే కొనసాగాలని సూచించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఉరవకొండ, ఆగస్టు 30: మండలంలోని పెన్నహోబిలం సమీపంలోని పొలంలో విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందాడు. చిన్నముష్టూరు గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు (51) పెన్నహోబిలంలో వ్యవసాయ బోరు క్రింద 3 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాడు. కాగా శుక్రవారం పంటకు నీళ్లు వదిలేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ మోటారు పనిచేయకపోవడంతో స్టార్టర్‌ను మరమ్మతులు చేస్తుండగా.. విద్యుత్ సరఫరా అయి షాక్ కొట్టింది. దీంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టు పక్కల రైతులు గమనించి వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



5 నుంచి సమ్మె బాట

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 30 : సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సెప్టెంబరు 5వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం వారు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు ఆధ్వర్యంలో పట్టణంలో ఆర్డీవో రాణి సుష్మితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తమ కష్టాలను తెలియజేస్తూ మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్ట, చాపిరి గ్రామాల ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, యూనియన్ నాయకులు వన్నూరప్ప, హనుమంతరాయుడు, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, రాధాకృష్ణ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ ఫ్యాక్టరీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

తాడిపత్రి, ఆగస్టు30: శుద్ధ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాడికి మండలంలోని రాయలచెరువు ప్రాంతంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు శుద్ధ ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాయన్నారు. అరకొర వేతనాలతో కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీల యజమానులు అధిక లాభాలు గడిస్తున్నప్పటికి కార్మికులకు మాత్రం మొండి చేయి చూపుతున్నారన్నారు. ఇప్పటికైనా కనీస వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ఉరవకొండ, ఆగస్టు30: వివిధ కేసుల్లో అక్రమంగా పట్టుబడిన మద్యాన్ని సెబ్‌అధికారులు ధ్వంసం చేశారు. పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో మద్యాన్ని వాహనం ద్వారా తొక్కించి ధ్వంసం చేశారు. 1150లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేయడం చేశామని, వాటి విలువ రూ.6లక్షల దాకా ఉంటుందని ఏఈఎస్ తెలిపారు. 10 లీటర్ల నాటు సారా కూడా ధ్వంసం చేశామన్నారు. సీఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని బుక్కాపురంలో గోపాల్ అనే వ్యక్తి నుంచి శుక్రవారం సాయంత్రం 28మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ సుబ్రమణ్యం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బంది రవీంద్రారెడ్డి, నవీన్ తదితరులు గోపాల్ ఇంటిలో సోదాలు నిర్వహించారన్నారు. అందులో అక్రమంగా నిల్వ ఉన్న 28మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని గోపాల్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఎరువుల దుకాణంలో చోరీ

● రూ.84వేల నగదు అపహరణ

యాడికి, ఆగస్టు 30: మండలంలోని రాయలచెరువులోని ఉమాశ్రీరంగ ఫర్టిలైజర్స్ దుకాణంలో చోరీ జరిగింది. ఘటనపై దుకాణం యజమాని రాము తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపులోని క్యాష్‌బాక్సులో గురువారం రూ.84వేల నగదును పెట్టానని, రాత్రి షాపు మూసివేసే సమయంలో హడావిడిలో నగదు తీసుకువెళ్లడం మరచిపోయానని తెలిపాడు. శుక్రవారం ఉదయం షాపు వద్దకు వచ్చి చూస్తే షట్టర్ పగలగొట్టి ఉందన్నాడు. లోపలికి వెళ్లి చూడగా.. క్యాష్ బాక్స్ తెరచి ఉందని, అం దులో నగదు కనిపించలేదని వాపోయాడు. షా పులో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే గుర్తుతెలియని వ్యక్తి లోపలికి ప్రవేశించి నగదు తీ సుకువెళ్లిన దృశ్యం రికార్డు అయినట్లు వివరించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దుండగుడు దుకాణంలో ఉన్నట్లు సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

ఇంట్లో చోరీ..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శాంతినగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే డివిజనల్ మెడికల్ అధికారి హరిత ఇంట్లో చోరీ జరిగిందని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈనెల 25వ తేదీన హరిత, ఆమె భర్త డాక్టర్ శ్రీధర్ ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి వచ్చేచూసేసరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. వారు పరిశీలించగా.. దుండుగులు లోపలికి చొరబడి బీరువాలోని ఐదు గ్రాముల చెవి కమ్మలు, 30 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.